విశ్వాసానికి
ప్రతిరూపంగా నిలిచిన
ఆనుక్కాలపై
అతడికిగల ప్రేమ!

# నాలుగే నాలుగు




"డాడీ పర్మిషను తీసుకునే వెళ్లాలంటే బొటానికల్ టూర్‌కి ఆగిపోవలసిందే. పిక్నిక్‌లా సరదాకు వెళ్లే టూర్ కాదిది. స్టడీస్‌కి సంబంధించింది. తప్పనిసరిగా వెళ్లి తీరవలసిందే. ప్లీజ్ డాడీకి వచ్చిన తర్వాత నీవే నచ్చజెప్పు మమ్మీ" అన్నది రమ్య.

ఇల్లు అనబడే ఆ సామ్రాజ్యంలో ఆ సామ్రాజ్యానికి స్వతంత్రత శూన్యమే. పదిమంది పిలుపులకు మాత్రమే ఆమె సామ్రాజ్యంగా వెలామణి అవుతున్నది.

ఏం చేస్తే ఏమంటారోనన్న భయం, అనుమానం తననింకా అంటిపెట్టుకునే వున్నాయి. ప్రతి విషయాన్ని మరో కొత్త కోణంలోంచి పరిశీలించే అలవాటుగల భర్త ముందు తనెలా నిర్ణయాలు చేయగలదు? ఎటువంటి సమస్య తెచ్చింది రమ్య? అని అనుకుంటూ చిట్టచివరికి "ఏమ్మా డాడీని ముందుగా అడిగి వుంటే బాగుండేది" అన్నది.

"అడిగాను. ఫలానా డేట్ అని మాత్రం చెప్పలేదు. అంటే ప్రోగ్రాం ఫలానారోజున అని తెలుసుకోలేనంతగా చదువులో మునిగిపోయారన్నమాట అని అన్నారు వెటకారంగా. లేదు డాడీ ఇంకా డేట్ ఫిక్స్ చేయలేదు" అన్నాను.

"భలే కాలేజీ, భలే లెక్చరర్స్, భలే స్టూడెంట్, అంతా యూనిటీ మెయిన్‌టెయిన్ చేస్తున్నారన్నమాట. కరెక్ట్‌గా డేట్ కనుక్కొని చెప్పు" అన్నారు.

"ఇప్పుడు డాడీ ఊళ్లో లేరు. ఎలా?" అంటుండగా వంటఇంటినుంచి వరండాలోకి హుషారుగా తోక ఆడిస్తూ, పరుగెత్తుతూ



గేటువైపు వెళ్తున్న పప్పీని చూసి "ఏయ్ పప్పీ ఇటురా. ఎక్కడికి పోతున్నావ్?" అంటూ అరచింది. వినకుండా గేట్‌వైపు వెళ్తుంటే అటువైపు చూసింది రమ్య.

గేటుకవతల రిక్షావాలాకి డబ్బులిస్తూ సాంబశివం సూట్‌కేస్‌తో కనపడ్డాడు.

"మమ్మీ నీ సమస్య తీరింది. ఇంక నా సమస్యే మిగిలింది" అన్నది.

మోయలేని బరువును తలపైనుంచి దించుకున్న మరుక్షణం ఎంత హాయిని అనుభవిస్తామో అంతకంటె ఎక్కువ హాయిని, స్వేచ్ఛగా ఊపిరి పీల్చుకుని అనుభవించింది. చెంబుతో నీళ్లు తీసుకువచ్చి లోపలికి వచ్చిన సాంబశివానికి అందించి "ఎలా వున్నది వదినెగారికి?" అని అడిగింది.

"ఫరవాలేదు. అనుకున్నంత ఆపద అర క్షణంలో తప్పిపోయింది. మంచి అదృష్టవంతురాలు అన్నారు. అందుకే పదిరోజులుండ వలసిన నేను నాలుగు రోజులలో వచ్చేశాను" అన్నాడు కాళ్లు కడుక్కుంటూ.

ఇప్పుడే ఊరినుంచి వచ్చారు. వెంటనే అడిగితే ఏమనుకుంటారోనని సంకోచిస్తున్నది.

గ్రహించిన సాంబశివం "ఏమ్మా అప్పుడెప్పుడో టూర్‌కి వెళ్లాలన్నావ్. డేట్ ఫిక్స్ కాలేదా?" అని అడిగాడు.

కాగల కార్యం గంధర్వులే తీరుస్తున్నంత ఆనందంతో "ఫిక్స్ అయింది డాడీ. రేపే వెళ్లాలి. మమ్మీనడిగితే మీరురావాలన్నది"

"కాలేజీ టూర్స్ కట్ చేయడానికి వీలులేదు. వెళ్తే మార్కులు ప్లస్ అవుతాయి, లేకుంటే లెస్ అవుతాయి. ఇంతకీ ఎన్నిరోజులో?" అన్నాడు.

"నాలుగే నాలుగు రోజులు"

"ఎక్కడికి?"

"నల్లమలై అడవులకి"

"ఐదోరోజున నీవిక్కడుంటావన్నమాట"

"తప్పకుండా డాడీ"

"అలాగే వెళ్లిరా" అంటూ డబ్బులిచ్చాడు.

"థాంక్యూ డాడీ" అంటూ కాలేజీకి వెళ్లింది రమ్య.

○ ● ○

మహానంది కూడా చూసి వెళ్దాం పనిలోపని అని లెక్చరర్స్ ఆకస్మిక ప్రోగ్రాం ఫిక్స్‌చేసిన కారణంగా అనుకున్న సమయానికి ఇంటికి చేరుకోలేక, ఆ మరునటిరోజు అంటే ఆరవరోజు చేరుకునేసరికి సాంబశివం శివమెత్తి కూర్చున్నాడు. విష్ చేస్తున్నా వినన్నట్లే వెళ్లిపోయాడు. గత ఐదురోజులుగా టూర్‌లో పొందిన ఆనందం ఆనవాలుకూడా లేదు. వాస్తవానికి తను తప్పుచేయకున్నా పనిష్‌మెంట్‌గా తనతో మాట్లాడడం మానేశారు. అంతకంటే నిందించినా బాధపడేది కాదేమో? కాని నిలువునా దహించివేసేటంతటి శిక్ష వేశారు. తను నాలుగు రోజులు ఆహారానికి దూరమవుతారు. తనని పదిరోజులు పస్తు పడుకోమని శాసించినా బాధపడేదికాదు. తనతో ఈ నాలుగురోజులు మాట్లాడరు. తనకో కూతురు వుందన్న విషయాన్ని మరచిపోతారు. సహజంగా బెడ్ మీద నుంచి నిద్ర మేల్కొనడమే తడవుగా గుడ్‌మార్నింగ్ చెప్పే అలవాటుని తనకు డాడీయే చేశారు. ఆ తర్వాతనే కాలకృత్యాలు, నిత్యకృత్యాలు. పైగా డాడీ రిటైరై ఇంటిపట్టునే వుండడంతో కలసి మీల్స్ చేసే అలవాటుకూడా అయింది. అటువంటి ఈ రోజు డాడీ లేకుండా ఒంటరిగా తనెలా భోజనం చేయగలదు? అనుకుంటూ ఆ నాలుగు రోజులు సాంబశివంతో సమానంగా రమ్యకూడా లంఖణం చేసింది.

తనకుంటే తనవెక్కడ కోప్పడతారోనని సుష్టుగా భోజనం ముగించింది తనకిష్టమైనవి ఆ నాలుగురోజులు చేసుకుని.

ఐదవ రోజున మాటలు మూగవోయినా ప్రాణంలేని కుర్చీలు ఆ తండ్రీకూతుళ్లని

పక్కపక్కనే కూర్చోబెట్టి, వాటిక నంజేలా చేశాయి.

ఆ సమయంలోనే "డాడీ ఇకనుంచి మీకు కష్టం కలిగించనుగా. నాతో మాట్లాడండి" అంటూ బ్రతిమలాడింది రమ్య కన్నీళ్లను కట్టుగుడ్డకు తుడుచుకుంటూ.

"చూడు రమ్యా, మరొకమారు చెప్తున్నా. నీవు తప్పుచేయలేదు. ఆ విషయం నాకు తెలుసు. వస్తానన్న సమయానికి రాకపోవడమే నీవు చేసిన తప్పు" అన్నాడు.

"అంతవరకు నలుగురిలో నవ్వులో పాలుపంచుకున్న నేను, మన విషయం లెక్చరర్స్‌కి తెలియజేసి, వారు హేళన చేస్తే, ఆ నలుగురిలోనే నవ్వులపాలు అయిపోతానేమోనని అడగడం మానేశాను. అందువల్లే ఆలస్యం అయింది" అన్నది.

"అంత రావడానికి వీలులేకపోయినప్పుడు అక్కడినుంచి నాకు ఇన్‌ఫర్మేషన్ ఫోన్‌ద్వారానో, టెలిగ్రాంద్వారానో ఇవ్వాలి"

"అలా ఇస్తే నేనే కావాలని ఇచ్చి వుంటాననుకుంటారని సందేహించా"

"ఇదేనా నన్ను అర్థం చేసుకున్నది. అనుకున్నది అనుకున్నట్లు చేయాలి. అప్పుడే విజయంవైపు పయనించగలం. అయితే ఆ అనుకునేముందు జాగ్రత్తగా ఆలోచించాలి. ఇదే మంచిమనుగడకు ముఖ్యమైన లక్షణం"

"అలాగే డాడీ! వస్తా" అంటూ తన గదిలోకి వెళ్లింది.

○ ● ○

వేకువఝామునే మార్నింగ్‌వాక్‌కి కిలోమీటరు దూరం వెళ్లే అలవాటుని, ఏరికోరి కొని తెచ్చుకుని పెంచుకుంటున్న పామేరియన్ కుక్కపిల్ల పప్పీకొరకు అర కిలోమీటరుతో సర్దుకున్నాడు ఎక్కడ అలసిపోతుందోనని. ఇంటికి రాగానే వరండాలోని తన వైరు ఫోల్డింగ్ చైర్‌లో రిలాక్స్ అయేవాడు. రమ్య బెడ్‌మీదనుంచే 'గుడ్‌మార్నింగ్' అంటూ విష్‌చేసిన దానికి బదులుగా విష్‌చేసి, సామ్రాజ్యం తెచ్చిన పెద్ద గ్లాసు పాలు తనుసేవించి, చిన్నగ్లాసు పాలు పప్పీకందించేవాడు.

# డాక్టర్ల మంత్రజాలం



ప్రస్తుతం మనం వాడుతున్న మందుల్లో చాలావరకు హానికరమైనవేకాక — విదేశాలలో నిషేధించబడినవి కూడా వుంటున్నాయి. పూనాకు చెందిన డాక్టర్ అనంత్ పాడ్కే ఈ మధ్యనే మహారాష్ట్రలోని సతారా జిల్లాలో ప్రభుత్వ, ప్రైవేట్ హాస్పిటల్స్‌లో డాక్టర్లు వ్రాసిన 3,500 ప్రిస్క్రిప్షన్స్‌ను పరిశీలించిన తర్వాత, వాటిలో ప్రతి ఐదు మందులలోనూ ఒకటి హానికరమైనదని అంటున్నారు. అంతేకాదు — ఆ జిల్లాలోని డాక్టర్లు ఇచ్చే 25 శాతం ఇంజక్షన్లు అసలు అవసరమే లేకుండా డబ్బుకోసం చేస్తున్నారని కూడా ఆయన సర్వేలో వెల్లడి అయింది! ఇలాంటి సర్వేలు మన దేశమంతా చేస్తే... మరెన్నో వింతైన విషయాలు బయటపడ్తాయి!

— జూపిటర్

ఆ తర్వాత దానిని ఫ్రీగా ఇంటి ఆవరణలో వదిలేసి, పెంచుతున్న మొక్కల బాగోగులు చూసేవాడు.

వేడినీళ్లతో పప్పీకి తనే స్వయంగా స్నానం చేయించి, టర్కీ టవలుతో తుడిచి వరండాలో ఫ్రీగా వదిలేవాడు. స్నానం చేసిన తర్వాత ఎటూ వెళ్లేది కాదు. హాయిగా నిద్రపోయేది. తనూ ఈ సమయంలోనే స్నానం ముగించుకుని పూజామందిరంలోని పటాలకు పూలమాలలు అలంకరించి, కొంత సమయం డైలీ పేపరులో లోకం తీరు తెల్సుకుని 12 గంటల సమయానికి పప్పీ పక్కనే వరండాలో కుర్చీ వేసుకుని కూర్చునేవాడు. ఇంక చాలు విశ్రాంతి అన్నట్లుగా ఒళ్లు విరుచుకుంటూ పప్పీ లేచి, తోక ఊపుకుంటూ సాంబశివం పాదాల పక్కనే చేరేది.

"పందిమాంసం పట్టుకొచ్చానయ్యగారూ" అన్న పనివాడి పలుకులకు బదులుగా—

"తీసుకురారా పాపం అడగలేదు. ఆకలితో అలమటిస్తోంది" అనగానే పనివాడు పప్పీని పక్కకు తీసుకెళ్లి తినిపిస్తూ—

"అయ్యగారూ కోప్పడకండి, నాకు తెలివిక అడుగుతుండా మీరు బ్యామ్మలుకదా, కుక్కపిల్లకి పందిమాంసం పెట్టెత్తుండారేంటి?" అని అడిగితే "తప్పేమీ లేదురా, ఎవరి ఆహారం వాళ్లు తీసుకోవాలి. అప్పుడే ఎవరి డ్యూటీ వారు చేయగలుగుతారు" అని బదులిచ్చాడు. పప్పీ తింటుంటే తను భోజనం చేయలేదన్న విషయాన్ని మరచి, కుడుపు నిండినంతగా సంతోషించేవాడు.

కొంత సమయం అటు ఇటు పచార్లుచేసి నిద్రావస్థలో చేరుకునేది.

సాంబశివం భోజనం ముగించుకుని విశ్రాంతి తీసుకునేవాడు.

సాయంకాలం చల్లమాటువేళ తోటపని ముగించుకుని తనతో ఈవెనింగ్ వాక్‌కి బీచ్‌కి తీసుకువెళ్లేవాడు. పక్కనే నుంచొని సముద్రంనుంచి వచ్చే కెరటాలని, ఆ కెరటాల వెనుక మరుగుని వింతగా చూస్తూ, రిప్లై కార్డులా తిరిగి ఒడ్డుకు చేరుకుంటున్న (ఎవరో విసిరేసిన) చెప్పుముక్కల్ని మరల ఎవరైనా వేస్తారేమోనని పరుగులు తీసి నోటికి కరుచుకుని దూరంగా ఇసుకలో వదలి వచ్చేది. పప్పీ తెలివితేటలకి మురిసిపోయేవాడు.

రాత్రికి ఇంటికి చేరుకున్న తర్వాత స్టడీస్ విషయంలో సందేహాలున్నాయని రమ్య అడిగితే నివృత్తి చేసేవాడు. సాంబశివం దినచర్య ఇది.

గత కొద్ది సంవత్సరాలుగా పప్పీ బాగా మాలిమి అయింది. షైరుకి వెళ్లేటప్పుడు హుషారుగా పరుగులు తీసుకున్నది. సాంబశివం ఆయాసపడుతున్నాడు. ఇరువురికి సంవత్సరాలు పెరుగుతున్నాయి. ఒకరికి శక్తి తరుగుతుంటే, మరొకచోట పెరుగుతున్నది. ఇదే కదా సృష్టి విచిత్రం. హద్దు దాటుతుంటే కళ్లెరచేసేవాడు. ముందుకు వెళ్లిన పప్పీ టర్న్ అవకుండా అడుగులు వెనక్కి వేస్తూ అతనిని చేరుకునేది. అది వెనక్కి వచ్చేతీరు అతనికి నవ్వుకలిగించేది.


సాంబశివం వూళ్లో వుంటే ఎవరిమాటా వినేదికాదు. కొత్తవాళ్లను అడుగు వేయనిచ్చేదికాదు. ఎవరైనా రావాలంటే కష్టమయ్యేది. తెలిసినవారు "ఏమిటండి ఈ కుక్క గొడవ? మీరున్నారో, లేదో తెలుసు

కోవడంకంటే ముందు కుక్క వున్నదో లేదో తెలుసుకోవడమే ముఖ్యమైపోతోంది. అసలుకంటే వడ్డీ ముందు అంటే ఇదే కాబోలు'' అంటుంటే మహదానందం పొం దేవాడు తను పెంచుతున్న తీరుని గుర్తుచేసు కుంటూ.

పొరుగూరు వెళ్లవలసినప్పుడు రమ్యని పిలిచి పప్పీని అప్పచెప్పేవాడు. శిరసావహిస్తా నన్నట్లుగా శిరస్సు వంచేది.

ఇంతగా అలవాటైన పప్పీ, గీసిన గీటు దాటని పప్పీ ఆ రోజు ఉదయం షైరుకి వెళ్లే సమయానికి వరండాలో లేకపోయేసరికి ''ప ప్పీ, పప్పీ, కమాన్. ఎక్కడా? ఏంచేస్తున్నా వ్? ఇంకా రెడీకాలేదా? ఇప్పటికే ఆలస్యమై ంది. త్వరగా బయల్దేరు'' అంటూ ఆవరణ మొత్తం కలియజూశాడు. ఎక్కడా జాడకూ డా లేదు. ఓవేళ తనకంటే ముందే షైరుకి వెళ్లిపోయుందేమోనని ఒంటరిగానే బయలుదే రి వెళ్లి చూశాడు. కనపడలేదు. మరో అరకిలోమీటరు అతికష్టమైనా నడిచి ''పప్పీ, పప్పీ, పప్పీ'' అంటూ అరచి చూశాడు. యోజనం దూరం వెళ్లినా ప్రయోజనం కనపడేలా లేదు. అసలు అడుగు జాడలే లేవు. ఎవరైనా అడుగుదామనుకున్నా నరజా ఢకూడా లేదు. జావగారుతూ అడుగులో అడుగు వేసుకుంటూ బీచ్ ఒడ్డుకు చేరుకు న్నాడు. ఆ ఒడ్డునుంచి, ఈ ఒడ్డువరకు వెతకడం గడ్డు సమస్యే అయినా ప్రయత్నం మానలేదు. ఫలితం శూన్యమే. నిస్పత్తువతో మెల్లగా ఇంటికి చేరుకున్నాడు.

వరండాలో దాని స్థానంలో వెలితి వెక్కిరి స్తున్నట్లుగా దర్శనమిచ్చింది. ''ఎటువెళ్లిందో , ఏమో? దానికి రోడ్లూ తెలియవే. రోజూ షైరుకి వెళ్లే ఆ రెండు రోడ్లు తప్ప. చిన్న పిల్లకదా. దారి తెలియక తికమకపడుతుందే మో''ననుకుంటూ గేటునుంచి వరండావర కు, వరండానుంచి గేటువరకు కాలుగాలిన పిల్లిలా ఏమి చేయాలో పాలుపోక అదేపనిగా తిరుగుతున్నాడు. కాళ్ల నొప్పులు పుడుతు న్నా లెక్కచేయకుండా.



''నిప్పులేకుండా పొగరాదు. తప్పుచేయకుండా ముప్పు కలుగదు. తనకెందుకీ పరిస్థితి వచ్చింది? అవును, నిజమే తను తప్పుచేశాడు. పప్పీని చైన్‌తో బంధించి వుండవలసింది. అందరూ అంటున్నా తనే వినకుండా అదేమీ క్రూరజంతువు కాదులే అని వారించాడు. అందుకే తనకీ పరిస్థితి'' అనుకుంటూ నిరీక్షిస్తున్నాడు.

సామ్రాజ్యం ''కనీసం పాలైనా తీసుకోండి'' అంటూ బ్రతిమలాడబోయింది. కళ్లతోనే బదులిచ్చాడు. ఆ రోజంతా ఆహారమే తీసుకోలేదు. రండాలోని ఈజీ ఛైర్‌లో వాలి, నిరీక్షించి, నీరసపడి నిదురపోయాడు తనకు తెలియకుండానే.

అర్ధరాత్రి దాటిన తర్వాత ప్రపంచమంతా ప్రశాంతతను చాటుతున్నది. పప్పీ పరుగున వచ్చి సాంబశివం పాదాల్ని నాకుతుండగా మెలకువ వచ్చి చూశాడు. అంతులేని ఆనందంతో ''వచ్చావుటే పిచ్చిదానా, ఎక్కడికి పోయావే? ఏమైపోయావ్? నువ్వు కనపడక ఎంత ఇది అయిపోయానో తెలుసా? నీకొరకు ఉదయంనుంచి పాలుకూడా తీసుకోలేదే. అవును నీవేమైనా పాలుతాగావా? లేదా? అవుమలే నాలాగా నీకు పాలుపట్టే వాళ్లెవరున్నారు? నిన్నెవరైనా ఎత్తుకుపోయారా? ఎలా తప్పించుకొచ్చావ్? నీకే రోడ్లు తెలియవుగదే రోజూ వెళ్లే ఆ రోడ్లు తప్ప. పోలీసులకు రిపోర్టుకూడా ఇద్దామనుకున్నా తెల్లవారితే'' అంటూ మనసులోని ఆవేదనని దానిముందు కక్కుకున్నాడు.

తల వంచుకుని ఇంకా అమాయకంగా పాదాలను, వేత్రివేళ్లనునాకుతూనే వున్నది.

''పోనీలేవే పిచ్చి ముఖమా ఎట్లాగైతేనేం మళ్లీ నన్ను చేరుకున్నావ్? నాకదే పదివేలు! నీకదే గొప్ప మేలు. అసలు మళ్లీ ఈ జన్మలో నిన్ను చూస్తాననుకోలేదు. నీకూ, నాకూ ఈ బంధం ఏ జన్మలోదో? నా స్వంత పిల్లలా పెనవేసుకుపోయావు నన్ను. ఇకనైనా వదలి వెళ్లకు. నేనూ నిన్నొదిలి వుండలేనే. నీవుకూడా నన్నొదిలి వుండలేవని ఇప్పుడే తెలిసింది. ఇంక వెళ్లవుకదూ!?'' అంటూ ఎడమచేత్తో ఎత్తుకుని, ఫ్రిజ్‌లోని పాలగ్లాసు నుదాని నోటికందించి, ఆ తర్వాత తనూ పాలుతాగి, పప్పీ మెడకి అంతకుముందే కొని అక్కర్లేదనుకుని దాచివుంచిన చైన్ మెడకలంకరించి అతను హాయిగా నిద్రపోయాడు.

తను కుక్కనన్న విషయం మరవకుండా ఆ పంచలోనే అటూ, ఇటూ పచార్లు చేస్తూ తన డ్యూటీ తను చేస్తున్నది.

○ ● ○

అప్పుడూ ఊరినుంచి వచ్చిన సాంబశివం వరండాలో పప్పీ కనిపించకపోయేసరికి, ఏమేవ్ పప్పీ ఎక్కడా కనపడదే?'' అని గాభరాగా అడిగాడు.

గ్యాస్ స్టవ్‌మీద వున్న తిర్ధగమోతను మూస్తూ, ''ఇక్కడలేదండి'' అన్నది.

''రమ్యా! పప్పీ ఎక్కడ?'' అని గట్టిగా అడిగాడు.

''ఇక్కడ లేదు డాడీ. అక్కడే వరండాలోనే వుండాలి'' అన్నది.

''ఎటు వెళ్లిందో తెలుసుకోకుంటే ఎలా? దాని బాధ్యత నీకప్పగించా కదా? ఒకసారి వెళ్లి వచ్చిందిగా మరచిపోయావా? అంత నిర్లక్ష్యం పనికిరాదు'' అన్నాడు.

''నిర్లక్ష్యంకాదు డాడీ. పెరట్లోనే ఉదయంనుంచి పచార్లు చేస్తున్నది. మంత్లీ టెస్ట్‌ల కారణంగా ప్రిపేర్ అవుతున్నాను. గంట క్రితమే చూసి వచ్చాను'' అన్నది

భయంగానే.

"అలాగా! ఆ మాట చెప్పమ్మగా" అంటూ పెరట్లోకి వెళ్లాడు. పప్పీ ఎదురుగా పడుకుని వున్నది. సాంబశివాన్ని చూసి తోక ఆడించిందేకాని లేచి ఎదురు రాలేదు. కనీసం లేవనుకూడా లేవలేదు. గమనించిన సాంబశివం "ఏయ్ పప్పీ ఏమైందే నీకు. త్వరగా రా. ఈ విషయం తెలుసా? ఈ రోజుకి నీవిక్కడకు వచ్చి నాలుగేళ్లు నిండి, ఐదవ ఏడు వచ్చిందే. మా ప్రకారం ఈ రోజు నీ బర్త్‌డే. చూడు నీకొరకు ఏం తెచ్చానో?" అంటూ అడుగు ముందుకు వేశాడు.

దగ్గరకు రాగానే పక్కకు వెళ్లింది. అర్థంకాక దాని వెనుకనే వెళ్లాడు. ఆ ప్రక్కనే వున్న నాలుగు కుక్కపిల్లలపై నాలికతో తన ప్రేమను ప్రదర్శిస్తున్నది. షాక్ తిన్నాడు. ఏమిటీ పప్పీకి అప్పుడే పిల్లలా? నాలుగేళ్లకే తన చిన్నారి పప్పీ తల్లి అయిందా? ఆశ్చర్యం. అందునా ఓ మామూలు ఊరకుక్క పిల్లలకు తల్లి అయిందే. ఛీ ఛీ ఎంత అవమానం. ఎంత అవమానం? అసలు కనటానికే అవకాశం లేదు. ఎప్పుడూ తనంటే భయపడ్తూ తన కనుసన్నలలో మెలుగుతుండే పప్పీ తనకు తెలియకుండా ఇంత వ్యవహారం నడిపిందా? నడిపే వుంటుంది. లేకుంటే తల్లి అయ్యే అవకాశం ఎలా కలుగుతుంది? ఆరోజు రమ్య అన్న మాటలు తనకిప్పుడు జ్ఞప్తికి వస్తున్నాయి.

"మమ్మీ ఈ మధ్య మన పప్పీ కాస్త ఒళ్లుచేసి బలిసినట్లు లేదూ" అన్నది.

"బలవకేం చేస్తుంది. మీ నాయనగారు ప్రత్యేక శ్రద్ధ తీసుకుని మాంసం తినిపిస్తున్నారుగా" అంది సామ్రాజ్యం.

"ఊర్కోండి. సుమారుగా మూడేళ్లను ంచి చిక్కి వున్నది. ఇప్పుడిప్పుడే ఒళ్లు చేయబోతున్నది. ఎవరైనా విన్నారంటే దిష్టి కొట్టి పాడైపోతుంది. వెళ్లండే అవతలికి" అంటూ గదమాయించాడు తను. నిజమే తను గ్రహించలేకపోయాడు.

అదుపు ఆజ్ఞలలో వుంచి పెంచినందుకు తనంటే భయం, భక్తి కనపరుస్తూ తన చాటున దాని విశ్వరూపాన్ని చూపించింది. కన్న కూతురిలా చూసుకున్నానే. కడుపుకోత కోసిందే. ఇదే కన్నపిల్లలు ఇలా ప్రవర్తిస్తే మన హోదా హోరుమంటూ రొదపెట్టుంది. బజారుపాలై బతుకే భారమౌతుంది. నా కళ్లు తెరిపించింది. ఇకనైనా నా కఠినమైన కట్టుబాట్లను సడలించి ప్రేమగా చూసుకుంటూ.

"ఏమేవ్ సామ్రాజ్యం, రమ్య త్వరగా రండి" అంటూ గట్టిగా పిలిచాడు.

"ఏ తప్పూ చేయకున్నా శిక్షించే తండ్రి తమను ఈ విషయంలో దోషిగా నిర్ణయించి పనిష్మెంట్ వేసి ప్రాణం తీస్తాడని అనుకుని భయంగా సామ్రాజ్యం వెనుక చేరి "మమ్మీ" అన్నది.

తనుమాత్రం ఏం చేయగలదు. ఆయన తత్వమే అంత. ఎన్నాళ్లిలా భయపడ్తూ ఇలా బతుకుతాం అన్న నిశ్చయానికి వచ్చి "పద, తప్పదుగా" అంటూ పెరట్లోకి అడుగువేశారు.

"దానికి పాలుతెచ్చిపెట్టండే. అసలే అలసిపోయి వున్నది. ఈరోజు పప్పీకి నాలుగవ సంవత్సరం నిండుతుందనుకున్నా. నాలుగు పిల్లలకు పుట్టినరోజు చేసుకుంటుంది" అన్న సాంబశివం పలుకులకి పరవశించిపోయారు.

○ ● ○